క్లుప్తంగా

'చలో బస్‌భవన్'కు తరలిన ఈయూ నేతలు



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంప్లాయిస్ యూనియన్ తలపెట్టిన చలో బస్‌భవన్ హైదరాబాద్ కార్యక్రమానికి ఖమ్మం రీజియన్ నేతలు తరలి వెళ్లారు. మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద ఆ పార్టీ జాతీయ సమితీ సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ కార్మికుల బస్సును జెండా ఊపి ప్రారంభించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాట మార్గాలే ఉత్తమమని వారు అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చిన హామీలను యాజమాన్యం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నగర అధ్యక్షుడి ఇంటికి 'ఈటల'



ఈటల రాజేందర్‌తో శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం కోసం జిల్లాకు వచ్చిన మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఈటల రాజేందర్ మంగళవారం నగర బీజేపీ ఖమ్మం అర్బన్, టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాసరావు ఇంటికి వచ్చారు.ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

తీరిన తాగునీటి సమస్య



ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న సిబ్బంది

ఖమ్మంరూరల్: మండలంలోని శ్రీసాయి గణేష్‌నగర్ కాలనీవాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుండగా.. సమస్యను తీర్చాలని కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యాన కలెక్టర్ వీపీ గౌతమ్‌ను కలిసి సమస్యను విన్నవించారు. దీంతో స్పందించిన కలెక్టర్ వెంటనే తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించగా.. మంగళవారం కాలనీలోని 270 గృహాలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా కోసం 5 కిలోమీటర్ల మేర పైపులైన్ వేయడంతో పాటు మంచినీటి ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాధనలు సిద్ధం చేశారు. తాగునీటి ఇబ్బందులు కలుగకుండా ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా కాని ఇళ్లకు సరఫరా చేశారు. కాలనీలో శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సరఫరా పనులు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. తమ సమస్యను తీర్చినందుకు కలెక్టర్‌కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	40	బచ్చలికూర	4
వంకాయ	46		20
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	78		20
కాకర	66	చుక్కకూర	3
బీర	48		20
దొండ	30	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	110	గోంగూర	4
గోరుచిక్కుడు	48		20
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	20		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	50		30
క్యారెట్	46	పుదీన	1
క్యాప్సికం	56		20

-ఖమ్మం వ్యవసాయం

రాజీవ్ సేవలు చిరస్మరణీయం

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి



కూసుమంచి: రాజీవ్ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి, నాయకులు

కూసుమంచి: దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకరావడంతో పాటు ఆర్థిక పథంలో నడిపించి కొత్త సంస్కరణలు తీసుకొచ్చిన దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కూసుమంచిలో ఆయన విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజీవ్ సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు జూకూరి గోపాలరావు, రామసహాయం వెంకటరెడ్డి, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, కాంగ్రెస్ నాయకులు ఎండీ హఫీజుద్దీన్, జొన్నలగడ్డ రవికుమార్, బజ్జూరి వెంకటరెడ్డి, యడవెల్లి రాంరెడ్డి,కొమిరెల్లి అలింగ గోవిందరెడ్డి, చాట్ల పరుశురాం, వీరభద్రం తదితకులు పాల్గొన్నారు.

దేశ సాంకేతిక అభివృద్ధికి ఆద్యుడు రాజీవ్..



డీసీసీ భవన్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఖమ్మంవన్‌టౌన్: దేశంలో సాంకేతిక అభివృద్ధికి బాటలు వేసిన గొప్ప పరిపాలనదక్షుడు దివంగత నేత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ కొనియాడారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో కలిసి రాజీవ్ గాంధీకి నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ సౌభ్రాతృత్వం కాపాడడం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడని, కంప్యూటర్ రంగాన్ని దేశానికి పరిచయం చేసి ఎంతో మంది విద్యార్థులు సాంకేతిక విద్యను నేర్చుకులనేలా చేసింది రాజీవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ జావీద్, కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు వద్దేబోయిన నరసింహారావు, జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సయ్యద్ గౌస్, కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వరరావు, భూక్యా బాలాజీనాయక్, గజ్జెల్లి వెంకన్న, బొమ్మిడి శ్రీనివాస్ యాదవ్, కామా అశోక్, గడ్డం వెంకటయ్య, మహమూద్, శంకర్ నాయక్, బాణాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల నివాళి..



కామేపల్లి: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామేపల్లి: కామేపల్లిలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన కార్యకర్తలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, దమ్మాలపాటి సత్యనారాయణ, గుజ్జర్లపూడి రాంబాబు, ధనియాకుల హనుమంతరావు, నల్లమోతు లక్ష్మయ్య, దేవండ్ల రామకృష్ణ, ధరావత్ అనురాధ, వరికొల్లు సైదులు, బాణోతు నరసింహానాయక్, అజ్మీర రాందాస్, శ్రీను, ముక్తి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లుగా మజ్జిగ, తాగునీరు పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని జహీర్‌పుర, గుట్టల బజార్ కాలనీవాసులు ఐక్యమత్యాన్ని చాటుకుంటూ ఈ ప్రాంత వాసులకు, ఈ మార్గంలో ప్రయాణించే వారి కోసం మజ్జిగ, తాగు నీరు పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత ఏడాది వేసవిలో ప్రారంభించిన ఈ కేంద్రాన్ని ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నారు. కాగా, ఈ కేంద్రం నిర్వహకులకు పెళ్లి రోజు, పుట్టిన రోజు నిర్వహించుకునే వారు దాతలుగా ముందుకు వస్తుండడంతో పగటి పూట మజ్జిగ పంపిణీ చేస్తూ.. తాగునీటిని ఎల్లప్పుడు అందుబాటులో ఉంచుతున్నారు. కాలనీలకు చెందిన కొలిశెట్టి ప్రభాకర్ రావు, వెంపటి లక్ష్మయ్య, పర్స దుర్గమ్మ, కృష్ణ ప్రసాద్, విశ్వనాథం, హిందుస్తాన్ సత్యనారాయణ తదితరుల ఆధ్వర్యాన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

షాపింగ్‌మాల్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న షాపింగ్‌మాల్ సిబ్బంది

ఖమ్మంవైద్యవిభాగం: తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం చెన్నై షాపింగ్‌మాల్, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈమేరకు మంగళవారం షాపింగ్‌మాల్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో షాపులో పని చేస్తున్న సిబ్బంది రక్తదానం చేశారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ బాధ్యులు పి.రవిచందర్ మాట్లాడుతూ.. తలసేమియా చిన్నారులకు రక్తదానం చేయించాలని షాపింగ్‌మాల్ యాజమాన్యాన్ని కోరగా.. శిబిరం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. దాతల సహకారంతోనే చిన్నారుల జీవితకాలం పెరుగుతుందని, వారికి సంస్థ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. షాపింగ్‌మాల్ బాధ్యులు ఏ.సాంబమూర్తి మాట్లాడుతూ.. షాపింగ్‌మాల్ విధులతో పాటు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, పి.ఉదయ్‌భాస్కర్, పి.అనిత, షాపింగ్‌మాల్ ఉద్యోగులు కె.నరేష్, ఎం.పూర్ణచందర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

గొల్ల, కురుమలను ప్రభుత్వం ఆదుకోవాలి

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయి, రాజారం గ్రామాల్లో ఇటీవల జీవాలు, మేకలు మృత్యువాత పడి నష్టపోయిన గొల్ల కురుమలను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భాషబోయిన వీరన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రాజారం గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. గొర్రెల పంపిణీ ఊసేలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజారం గ్రామంలో గడ్డి మందు పిచికారీ చేసిన పంటను మేసిన గొర్రెలు 100కు పైగా మరణించాయని, కాకరవాయిలో వీధి కుక్కల దాడిలో 40 మేకలు మృతిచెందాయన్నారు. ఈ విషయంపై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించి ఆదుకోవాలన్నారు. నాయకులు ఆర్మి రవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న దృశ్యం

ఖమ్మం లీగల్: న్యాయవాది వరదాచారి మృతికి బార్ అసోసియేషన్ సంతాపం తెలిపింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యాన మంగళవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో వరదాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఒకరోజు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ.. బార్ అధ్యక్షుడిగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, ప్రభుత్వ న్యాయవాదిగా, లీగల్ అడ్వైజర్‌గా అనేక పదవులు నిర్వహించి న్యాయవాద వృత్తికి వన్నె తీసుకొచ్చారని, న్యాయవాదులకు ఆయన ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బార్ బాధ్యులు చింతనిప్పు వెంకట్, లలిత, ప్రభుత్వ న్యాయవాది కృష్ణారావు, న్యాయవాదులు పోట్ల మాధవరావు, సంధ్యారాణి, కృష్ణమూర్తి, మలేదు నాగేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆలోచన అదుర్స్..



క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

మండలంలోని కోయచలక గ్రామంలోని పలువురు విద్యార్థులు వినూత్నంగా ఆలోచించారు. ఒక వైపు పాఠశాలలకు వేసవి సెలవులతో ఖాళీగా ఉండడం, మరో వైపు ఎండలు అధికంగా ఉండడంతో వారికి క్రికెట్‌పై ఉన్న ఆసక్తితో మంగళవారం ఇదిగో ఇలా ప్రాక్టీస్ చేశారు. ఎండ ప్రభావానికి గురి కాకుండా తమకు వచ్చిన ఆలోచనతో గ్రామంలోని వాటర్ ట్యాంకు తాడు కట్టి.. దానికి బంతిని వేలాడదీసి బ్యాటింగ్ చేసినట్లుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. దీన్ని చూసినవారంతా వారి ఆలోచన అదుర్స్ అంటున్నారు.

– రఘునాథపాలెం

ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌రావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం, నల్లగొండ, వరంగల్ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు కోరారు. మంగళవారం ప్రేమేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మంలోని వన్‌టౌన్ బూత్ కోఆర్డినేటర్ ఆధ్వర్యాన పాకబండబజార్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రేమేందర్‌రెడ్డి గెలుపునకు ఒక్కో కార్యకర్త 50 మంది ఓటర్లను కలుసుకునేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు సన్నె ఉదయ్‌ప్రతాప్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్ర ప్రసాద్, నాయకులు రుద్రప్రదీప్, మందసరస్వతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అంతేకాక ప్రేమేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ.. ఖమ్మం గ్రంథాలయంలో బీజేపీ శ్రేణులు విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతుక ప్రేమేందర్‌రెడ్డి అని అందుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నగర ఇన్‌చార్జ్ పెద్దోళ్ల గంగారెడ్డి, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలంలో వర్షం..

రఘునాథపాలెం: మండలంలో మంగళవారం ఒక మాదిరి వర్షం పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండతో పాటు, ఉక్కపోతతో అతలాకుతలం చేసిన వాతావరణం ఒక్కసారి గాలితో కూడిన వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. వర్షం, గాలి ప్రభావంతో విద్యుత్ సరఫరాకు సుమారు 2 గంటల పాటు అంతరాయం జరుగగా.. లైన్లు మరమ్మతులు చేసి సరఫరాను పునురుద్ధరించారు. వర్షంతో వరి కోతల కాని రైతులు ఇబ్బంది పడుతుండగా.. కొత్తగా వ్యవసాయం చేసే రైతులకు మాత్రం అనుకూలంగా ఉండంటున్నారు. పొలాల్లోని చెత్త, పత్తి, మిరప కట్టెలను తొలిగింపుతో పాటు వేసవి దుక్కులకు వాన అనుకూలంగానే ఉంటుందని రైతులు చెబుతున్నారు. మండలంలోని కోయచలక, రేగులచలక, కోటపాడు, చిమ్మపుడి, రఘునాథపాలెం తదితర గ్రామాల పరిధిలో వర్షం పడినట్లు రైతులు తెలిపారు.



రేగులచలకలో కురుస్తున్న వర్షం

సుదర్శన యాగం ప్రారంభం



సుదర్శన యాగం చేస్తున్న పండితులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం(గుట్ట)లో వార్షిక పంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం సంప్రదాయ పద్ధతుల్లో అర్చకులు, పండితులు శ్రీ సుదర్శన యాగాన్ని ప్రారంభించారు. మంగళవాయిద్యాల నడుమ ప్రాతఃకాలార్చనతో కార్యక్రమాన్ని ప్రారంభించాక పానకాభిషేకం, విశ్వక్సేన పూజ, బాలబోగ నివేదన, పుణ్యాహవచనం, మధ్యాహ్నం నీరాజన మంత్ర పుష్పం, సాయంత్రం విశేష పూజ, రుణ విమోచన కోసం శ్రీ సుదర్శన యాగం, రాత్రి నివేదన, బలిహరణ, తీర్థ ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు పర్యవేక్షణలో అర్చకులు, పండితులు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు.

వైభవంగా నృసింహుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని మామిళ్లగూడెం రామాలయం రోడ్డు డైమండ్ టవర్స్‌లో మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సంప్రదాయ పద్ధతుల్లో స్వామివార్లను అలంకరించి అర్చకుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్సా వెంకటలక్ష్మి, నరసింహారావు, కొండపల్లి, భార్గవ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు కాసులనాటి సుందరరామయ్య, ఆలపాటి సాంబశివరావులు తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న గెలుపునకు ప్రచారం



ప్రచారం చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఖమ్మం సహకారనగర్/తిరుమలాయపాలెం: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునివ్వగా, తిరుమలాయపాలెంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం నగరంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో తీన్మార్ మల్లన్నతో కలిసి సమావేశం నిర్వహించగా.. పలు ప్రాంతాల్లో తీన్మార్ మల్లన్న గెలుపు కోసం పట్టభద్రులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా మద్దతు ప్రకటించిన తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, పార్వతి సత్యనారాయణ, నాయకులు బాలాజీ, పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్టా శ్రీనివాసరావు, కొమ్మినేని అనిల్‌కుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోళ్ల సుధాకర్‌రెడ్డి, మహమ్మద్ జావీద్‌మియా, టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, టీఆర్‌టీపీ తదితర సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఈ నేపథ్యాన ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు తమ సంఘం మద్దతునిస్తున్నట్లు గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్(జీటీఏ) బాధ్యులు కాసం ప్రభాకర్, దుర్గం రవిలు ఒక ప్రకటనలో తెలిపారు.

సీపీఐ మద్దతు కోరిన మల్లన్న..

ఖమ్మంమయూరిసెంటర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని తీన్మార్ మల్లన్న సీపీఐ నేతలను కోరారు. మంగళవారం పార్టీ కార్యాలయానికి వెళ్లిన ఆయనకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ప్రశ్నించే గొంతుకైనా తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సీపీఐ నేతలు పిలుపునిస్తూ.. తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు పార్టీ నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సింగు నర్సింహారావు, మేకల శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వర్లు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి 'ఆప్' మద్దతు..

ఖమ్మం మామిళ్లగూడెం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) మద్దతు ప్రకటించింది. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం స్వర్ణ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు నల్లమోతు తిరుమలరావు మాట్లాడారు. ఇండియా కూటమి పొత్తు ధర్మంలో భాగంగా మల్లన్నకు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. నాయకులు గంధం పుల్లయ్య, పసుమర్తి శ్రీనివాస్, సిద్దెల రాంబాబు, గుత్తా నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఐతగాని రాఘవేంద్ర గౌడ్

ఖమ్మం మామిళ్లగూడెం: తనకు అవకాశం ఇస్తే నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఐతగాని రాఘవేంద్రగౌడ్ కోరారు. మంగళవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవకాశవాదులు ఉద్యోగాల పేరుతో రాజకీయపార్టీలు నిరుద్యోగులకు నిలువునా మోసం చేస్తున్నాయని విమర్శించారు. తనను గెలిపిస్తే ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయిస్తానని, టీచర్లకు ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్ ప్రక్రియ సజావుగా జరిగేలా కృషి చేస్తామన్నారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో రాకేష్, జయంత్, ఉమేష్, సాయిశివ, డాక్టర్ విద్యారాణి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

నగరంలో గుంతలు..



ఎన్‌టీఆర్ జంక్షన్‌లో ఏర్పడిన గుంత



ఇందిరానగర్ జంక్షన్‌లో..

నగరంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన జంక్షన్‌లో గుంతలుపడి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఎన్‌టీఆర్ సర్కిల్‌లో ఇల్లెందు ప్రధాన రోడ్డు మార్గంలో వచ్చే వాహనాలు, ప్రధాన వైరా బైపాస్‌రోడ్డుకు వెళ్లే వాహనాలు జంక్షన్‌లో రాకుండా పక్క నుంచి వెళ్లే మార్గంలో గుంతలు పడి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు గుంతలు, మరో వైపు ఆటోలు, ఇతర వాహనదారులు, దుకాణదారులు ఉన్న ఆ కొద్దిపాటి డైవర్షన్ రోడ్డుపైకి చొచ్చుకొని రావడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. మరో వైపు ఇందిరానగర్ జంక్షన్‌లో కూడా ఇదే తరహా సమస్య నెలకొంది. టేకులపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు వైరా రోడ్డులో వెళ్లే మార్గంలో గుంత ఏర్పడింది. ఇప్పటికైనా వాహనదారులకు ఇబ్బంది లేకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

- ఖమ్మంఅర్బన్